REGD : No. H 18

విడిప్రతి 0–20పై.

18–2–66 శుక్రవారం

# జమీన్ రైతు

స్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 38 ] సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి [ సంచిక 7

## రైతాంగానికి చల్లనివార్త

రైతులను అత్యంతంగా ఆందోళన పరచిన ధాన్యం లెవీపద్ధతిని రద్దుపరచినట్లు ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి 17 తేది శాసనసభలో ప్రకటించారు. మిల్లర్లనుండే ప్రభుత్వం ధాన్యం సేకరించుకొంటుంది. లెవీ రద్దుదృష్ట్యా, అదనంగాయిచ్చే ధాన్యానికి రైతుకివ్వదలచిన బోనస్ కూడా రద్దు అవుతుందా, లేక ఇస్తారా అనేది తెలియలేదు. ఇవ్వడమే న్యాయం.

# లెవీ రభస–

# ఏ. సి. మీద శ్రీకాకుళం జిల్లావారి కినుక:

# రాజీనామా అనుమతికై ముఖ్యమంత్రికి అభ్యర్థన!

( మా హైదరాబాదు విలేఖరి )

అహారివదార్థాల లెవీ సమస్య ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానికి గుదిబండగా తయారైంది. లెవీ విధానమంటేనే కాంగ్రెసు వాదులకెంతటియమో అయిష్టతో, శాసన సభానమావేశాలు ప్రారంభంకాగానే వెల్లడయిపోయింది.

కొన్నాళ్ళుగా శ్రీకాకుళంజిల్లా కాంగ్రెసువాదులు లెవీ విధానానికి వ్యతిరేకంగా ధ్వజమెత్తారు. ఇది రానురాను వ్యవస్థీకృతమైన ఆందోళన రూపందాల్చడానికి కొక కారణం, కాస్త గగ్గోలుపెడితే తమ కోరిక నెరవేర్తుందనేనమ్మకం వుండడం వల్లనే. ఈ నమ్మకం కలగడానికికూడా కారణం లేకపోలేదు. రెండునెలల్కిందం నీలం సంజీవరెడ్డిగారితో రాష్ట్రమంత్రులు, నాయకులు శ్రీకాకుళంజిల్లా పర్యటించినప్పుడు, రైతులనుంచి నేరుగా వసూలు చేసే లెవీపద్ధతికి ఆ జిల్లాలో స్వస్తిచెప్పడం శక్యమనే అభిప్రాయాన్ని అక్కడి కాంగ్రెసునాయకులకు కలిగించారు.

ఈ పద్ధతిని రద్దుచేయడం ముఖ్యమంత్రికి ఇష్టంగావున్నట్లు కనిపించదు. కాగా అనంతపురంజిల్లా పర్యటించేటప్పుడు లెవీ విధానంలో మార్పు ఏమాత్రం వుండదని గట్టిగా ఆయన చెప్పేశారు. మొదటి ఒకటి రెండు సభల్లోనే ఇలా ప్రకటించేసరికి, లెవీ రద్దుచేయమని అక్కడినాయకులెవరూ మళ్లీ బహిరంగసభలో కోరలేదు.


ఇంతటితో ఈ విషయమై వివాదం సమసిపోతుందనుకుంటే, శ్రీకాకుళంవారు లెవీ వ్యతిరేకవుద్యమాన్నే ప్రారంభించారు. ప్రదేశ్ కాంగ్రెసు కార్యదర్శి లుకలాపు లక్ష్మణదాసుగారు జయపూర్ కాంగ్రెసు మహాసభకుకూడా వెళ్లకుండా ఇక్కడే మకాంపెట్టి నాయకత్వం వహించారు. వీరికి ప్రదేశ్ కాంగ్రెసుఅధ్యక్షుడు తిమ్మారెడ్డిగారి సమర్థన వుండనేవుంది.

తిమ్మారెడ్డి, లక్ష్మణదాసు ప్రభృతులు కూడా లెవీ విధించడమే అవసరమైతే

—తరువాత 7 వ పేజీలో



విద్యానగర్ (వాకాడు) కళాశాల సాంవత్సరికోత్సవాలకు ఆ ప్రాంగణంలో క్రొత్తగా నిర్మింపబడిన 'లాల్ బహదూర్ కళాసదన్' లో ప్రారంభోత్సవం జరుపుతున్న డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి.



ఇది పశువుల దొడ్డికాదు – నెల్లూరుజిల్లా కాంగ్రెస్ భవనం!

# నేను జిల్లాకాంగ్రెస్ భవనాన్ని!

# నా ఆత్మకథ వింటారా?

అమధ్య, "మాకూవున్నయ్ స్వగతాలు" అనే పేరుతో మహారచయిత స్వర్గీయ గోపీచంద్‌గారు ఒక పుస్తకం వ్రాశారు. అందులో ఆయన, తుమ్మచెట్టు, బర్రె–ఇట్లా మాటలురాని మూగజీవుల స్వగతాల్ని మనోహరంగా విన్పించాడు. అట్లనే నేను రోజూ సాయంత్రం షికారుకు వెళ్తుంటే దారిలో అతిగతిలేకుండా దశాబ్దాలపాటు అట్లనే పడివుండే దయనీయమైన ఆ నెల్లూరుజిల్లా కాంగ్రెస్ భవనం చూసినప్పుడల్లా ఈ కాంగ్రెస్ భవనానికి మాత్రం స్వగతాలు లేకుండా పోతాయా అనిపించేది. చెవివొగ్గి వినేనాథుడుండాలగాని,ఆ మూగభాషను గ్రహించగలిగిన మనిషి వుండాలకాని; స్వాతంత్ర్యం రాకపూర్వంనుండీ తరతరాల కాంగ్రెస్ రక్తాలు ప్రవహించి, ఎందరెందరో నాయకులు ఎన్నెన్నో గద్దెలెక్కినా దీని ఆలనాపాలనా పట్టించుకొని ఘోర దీనచరిత్రను యీనోరులేని భవనం తప్ప మరొకటి యెట్లా విన్పించగలదు? దిక్కులేని ఆ భవనం ఏదోచెప్తున్నది, వినండి–

నాకని పూర్వం నెల్లూరు నడిబొడ్డున పొగతోటలో వొక స్థలం వుండేదట. ఆ స్థలాన్ని ఎవరికో ధారాదత్తంచేసి, ఆ డబ్బుకు, జిల్లాకాంగ్రెస్ నిల్వధనాన్ని జతచేసి ఇప్పుడు యీ భవనాన్ని గోడలు దాకాకట్టి నన్ను మొండెంగా నిలబెట్టివున్న యీ స్థలం మున్సిపాల్టీచేత మా అధ్యక్షులుగాకూడా వుండిన ఆ చేర్మెన్ ఇప్పించాడట. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లో కాంగ్రెస్‌కు భవనం కట్టించాలని 30 వేలు కాటోలు వొక కంట్రాక్టర్ కాని ఒకభద్రుడు దారి చేతి చిక్కి నిర్మించమన్నారు. ఎందువల్లనో నారూపం పూర్తి కాకుండానే అనాథనుపాలై ఆనాటినుండి నేటిదాకా అట్లనే వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ కృంగికృశించిపోతున్నాను. కాంగ్రెస్ పేరుచెప్పుకొని అధికారఫలాల్ని ఎవ్వరికీ అందనీకుండా అనుభవిస్తున్న అన్నయ్యలెవరికీ తమ దయాదృష్టిని నామీద ప్రసరించడానికి తీరిక లభించడంలేదు. ఎన్ని ఎన్నికలు జరిపివుంటారు?; ఎన్ని రాజకీయ తిరునాళ్లలు చేసివుంటారు?;ఎన్ని విందులు వినోదాలు నిర్వహించివుంటారు? నానంస్థపేరుతో ఎందరు ఎన్నివిధాలుగా

**ఒక అజ్ఞాత లేఖిని**

బాగుపడివుంటారు?– అయినా నా ముఖం చూచినవాడు లేడు. ఎంత దయలేనివారు యీ కాంగ్రెస్‌వారు! అని అనాలనివున్నా ఆమాట అనడానికిమాత్రం నాకు నోరు పెగలడంలేదు; గుండె రావడంలేదు.

ఈ భవనాన్ని పూర్తిచేసి నానెత్తిన కప్పువేసి నీడకల్పించాలని యీమధ్య ఎన్నెన్ని రకాలగానో ప్రయత్నాలు జరిగాయి, ఎందరెందరు దాతలనుండో వాగ్దానాలు పొందబడినాయి, ఎన్నెన్ని విధాలగానో వసూళ్లు జరిగాయి. ఆ డబ్బంతా ఏమైందో ఏమోకాని నా ఖర్మమాత్రం అనాటినుండి యీనాటిదాకా ఇట్లనే వెల్లారుతూవుంది. నేనుమాత్రం దినదినానికి కృంగి కృశించిపోతున్నాను. నాముఖాన పిడకలుకొట్టి నానా భరాబు చేస్తున్నారు. నా కిటికీలకు తాటాకులుకట్టి రభసచేస్తున్నారు. బట్టలను కట్టేసి, పశువుల్నితోలి రొచ్చుగుంట చేస్తున్నారు. అదపాదపా పావంలాంటి రీతి సమయాల్లో శివశివా పాపవు వసు

—తరువాత 7-వ పేజీలో

కాఫీబోర్డు సేల్సులోనే ధరలు ఎక్కువైనందున

## కాఫీపొడి ధర

పెంచవలసి వచ్చినది

దీనికి మన్నించమని పాఠకులందర్నూ కోరుచున్నాము.

క్రిందిరేట్లు గమనించ ప్రార్థన:-

స్పెషల్ కాఫీపొడి K. 1 9–60
ప్లాంటేషన్ కాఫీపొడి K. 1 9–00
రెడ్‌లేబిలు కాఫీపొడి K. 1 9–00

## నిర్మల కాఫీ వర్క్సు

ట్రంకురోడ్డు—నెల్లూరు

ఫోన్ : : 280.

## కావలికాల్వ-ఏ. సి.

( 5 వ పేజీ కొరవ )

లేదు. ఇప్పటి ప్రజలు ఇంతిలేనివారు. వారెట్లా నమ్ముతారు? ప్రభుత్వమే పూనుకొని కావలి కాల్వను తేవాలి. కావలి కాల్వకు సంబంధించి ప్రయత్న లోపమేమీలేదని మాత్రం చెప్తున్నాను''.

శ్రీ ఆనం సంజీవరెడ్డిగారి సభనయ సామ్య వచనాలు: ''కావలి కాలువకు వేసిన పునాదిరాయి సమాధిరాయి అవుతుందేమోనని నేనన్నది నిజమే. పునాది రాయి వేసేనాటికి ఇంకా వెస్టిగేషన్ కూడా మొదలు పెట్టలేదు. తొందరపాటు పనులు పనికిరావు. కావలికాల్వకు పునర్జన్మ అనేది రావాలి. అది ఏ. సి. చేతిలోనేవుంది. కావలి తాలూకా ప్రజలమీద ఆయనకు అభిమానం వున్నది. వారి హయాంలోనే కావలి కాలువ వస్తుంది.''

ఇక సభకు అధ్యక్షత వహించిన శ్రీ వేమిరెడ్డి అయ్యపరెడ్డిగారు తన ప్రారంభోపన్యాసంలో అంతకు ముందురోజు జరిగిన రైతుసభను గూర్చి ప్రస్తావించి, ఆసభలో పాల్గొన్న నాయకులు యథార్థాన్ని కప్పిపుచ్చి అసత్యప్రచారం చేయడం జరిగిందన్నారు. ఆసభలో పాల్గొన్న నాయకులకు కావలిమీద యింతవరకులేని ఆదరం యిప్పుడెందువల్ల కలిగిందో ప్రజలు తెలిసికోవాలన్నారు. కావలి కాల్వనుగూర్చి ఇలా అన్నారు- ''నిన్నటిదినం వచ్చిన నాయకులు ఈ విషయంలో చాల దొస్తిగా మాట్లాడినారట. తామంతా కృషిచేసినట్లు, ఏ. సి. పడగొట్టినట్లు అభిప్రాయం వచ్చేట్లు మాట్లాడినారట. పునాదిరాయి వేయించడంలో శ్రీ రేబాల దశరథ రామరెడ్డిగారికి దురుద్దేశ్యమేదైనా వున్నదేమో తెలిసికోవలసివుంది'' (ఈ మాట అంటుండగా దాన్నిగూర్చి ఏమీ మాట్లాడవద్దని అయ్యపరెడ్డిని ఏ. సి. ఆదేశించారు.)

### లెవీ-ఏ. సి. సమాధానం

ఆ సభలోనే శ్రీ ఏ. సి. ధాన్యం లెవీని గూర్చి అన్నమాటలివి:

''ఈ విషయాన్ని పార్టీ సమావేశంలో నిర్ణయం చేశాము. ఇప్పుడు దీన్ని వ్యతిరేకిస్తూ మాట్లాడుతున్నవారు అప్పుడు ఏం చేస్తుండినారు? దీన్ని పేక ఆడుకొంటుండినారా? అప్పుడే వ్యతిరేకించగూడదా? లెవీ వసూలు నా స్వంతానికేమీగాదే! రైతులను బాధ పెట్టకూడదనే నావాదం. లీనా మాసాలలో ప్రజలకు తిండిగింజల యిబ్బంది లేకుండా చేయడానికే లెవీ వచ్చింది. నేను కళ్ళుమూసుకొని చేవ్రాలు పెట్టే మంత్రిని కాదే! ప్రతివిషయాన్ని గట్టిగాచేయాలని వుద్దేశ్యపడేవాణ్ణి'' అంటూ ధాన్యసేకరణ, సిల్యేలనుగూర్చి కొంత వివరించి చివరన యిలా అన్నారు.

### రాజీనామా ఇస్తాను

''రైతులను బాధించవలసిన అవసరం నాకులేదు. అట్టి పరిస్థితివస్తే నా మంత్రి పదవికి రాజీనామా యిస్తాను. మంత్రి పదవి లేకపోతే గౌరవం వుండదా? 'జమీన్‌రైతు'లో ఒక వ్యాసం చూచాను. నేను రైతును బాధిస్తున్నానని అందులో వ్రాయబడింది. దొంగరవాణాను అరికట్టడానికి లెవీ పెట్టాము కాని రైతులను బాధించడానికికాదు. వందసిబోట్ల రైతులను ఒత్తిడిచేయవద్దని కలెక్టర్లను ఆదేశించాము. ప్రభుత్వవిధానాల్లో లోపంలేదు. అమలు జరపడంలో, అమలుజరిపేవాళ్లలో లోపం వున్నట్లుతోస్తుంది''

### దేవుణ్ణిపెట్టినా ఇంతే!

ఏ. సి. తన వుపన్యాసాన్ని కొనసాగిస్తూ ఇంకా యిలా అన్నారు—''కావలిలో ఉదయగిరిరోడ్డు మొదట్లో ఒక చెక్‌పోస్టును చూచాను. అది యెందుకు పెట్టినట్లు? దాన్ని వెంటనే ఎత్తివేయవలసిందిగా ఆదేశించాను. అవసరమైనచోట్ల చెక్‌పోస్టులను పెట్టి ప్రజలు అనవసరంగా ముడుపులు చెల్లించుకోవలసిన పరిస్థితిఏర్పడింది. ఎన్ని చెక్‌పోస్టులున్నా కనీసం మూడు నాలుగు లక్షల టన్నులయినా దొంగతనంగా ఇతర రాష్ట్రాలకు పోయివుంటవని నా అంచనా. చెక్‌పోస్టుల్లో దేవుణ్ణి తెచ్చిపెట్టినా చెడిపోయేట్టున్నాడు. దొంగతనంగా యితర రాష్ట్రాలకు పోయేదానికన్నా ప్రభుత్వం ద్వారాపోతే మనం ఇతర రాష్ట్రాలకు సహాయం చేసినట్టుంది. అవసరమైనప్పుడు వారినుండి మనం యింకేదైనా సహాయం కోరడానికి వీలుంటుంది''

### చిక్కంతా సరిగపంచల వాళ్ళతోనే!

ఏ. సి. తన వుపన్యాసాన్ని అంతటితో నిల్పలేదు-

''కాబట్టి లెవీ పద్ధతి అన్యాయమని మా పార్టీవారు చెప్పడం నాకు ఆశ్చర్యంగా వుంది. జిల్లాకలెక్టరుకు పూర్తి అధికారమిచ్చాం. వంటనుగూర్చి అనుమానం వచ్చినపుడు రైతు మాటకే విలువివ్వమన్నాం. నిన్నటిదినం ఈవూళ్లో మాట్లాడినవారిలో (దశరథరామరెడ్డి వగైరాలని మంత్రిగారి భావం) ఎవ్వరూ భూమి దున్నేవారు లేరు. పుట్టికి ఎన్నితూములో కూడా తెలియదు వారికి. చిన్నరైతులతో మాకు ఏ నాడూ చిక్కులేదు. చిక్కంతా 15 ఎకరాలపైనవుండే సరిగపంచలవాళ్ళతోనే! ఏమయినా రైతుమాత్రం బాధపడకుండా చూస్తాను.'' అంటూ తన వుపన్యాసాన్ని ముగించారు —మా. వి.

---

## ఈ వారం విశేషాలు

(2 వ పేజీ కొరవ)

ఆలిండియా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి పదవికోసం జరిగేవేట అంతుతేలేటట్లులేదు. రాజస్థాన్ ముఖ్యమంత్రి శ్రీ మోహన్‌లాల్ సుఖాడియాను ఆ పదవికి తీసుకోవాలని కామరాజ్-ఇందిరమ్మలు ముందు పథకం వేసుకొన్నారు. సుఖాడియాకూడా అందుకు వప్పుకున్నారు. తీరాచూస్తే యీ పథకం పారలేదు. కొత్తముఖ్యమంత్రిని ఎన్నికచేసి తాను వైదొలగాలనుకొన్నాడు. కాని మొన్న 15 తేదిన అందుకుగా ఏర్పాటైన శాసనసభ కాంగ్రెస్‌పార్టీ సమావేశం జరగక రగడ యేర్పడి రద్దుఅయింది. అక్కడ ఆయన ముఖ్యమంత్రి పదవిని వదిలిపెడితే, ఆ స్థానంలో ఎవరుండాలనే విషయమై ముఠాల ఉకలుకలు బయలుదేరాయి. అందువల్ల సుఖాడియాయే ముఖ్యమంత్రిగా వుండిపొమ్మని అయన్నే త్వమేవశరణమ్ అని వేడుకోగా దాంతో మొత్తం వ్యవహారం మెలికపడిపోయి సుఖాడియామే ముఖ్యమంత్రిగా వుండిపోవల్సివచ్చింది. వరసబెట్టి 12 ఏండ్లుగా ఆయన ఆ పదవిలో వుంటున్నారు. ఇక కాంగ్రెస్ కార్యదర్శి కోసం కొత్తవేట ప్రారంభంకావాలిగదా!

' ' '

లోకసభ నాయకుడుగా ఎవరూ అనుకోని పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి శ్రీ సత్యనారాయణ సిన్హాను నియమించారు శ్రీమతి ఇందిరాగాంధీ. నందాగారు అవుతారను కున్నారంతా. పాపం నందాగారి 'కోరలు' పీకేస్తున్నారు.

' ' '

చూస్తుండగానే మళ్ళీ వొక విమాన ప్రమాదం. కలకత్తానుంచి ఢిల్లీ వస్తున్న ఇండియా కారవర్లీ 'ఆకాశదూత' విమానం మొన్న మంచుతోనిండిన ఢిల్లీ పాలం విమానాశ్రయంవద్ద మంటల్లో చిక్కుకుని క్రిందకుదిగుతూనేలకూలింది. అదృష్టవశాత్తు అందులోవున్న 74 మంది ప్రయాణీకులకు ప్రాణాపాయం తప్పిపోయింది. విమానం మాత్రం నిలువునా ముక్కలైపోయింది. ఈవొక్కనెలలో యిది మూడో విమానప్రమాదం. ఘోరంగానేవుంది.

— —



నెల్లూరు శ్రీనివాస్‌లో నేడే చూడండి

అనురూపావారి అద్భుత మహోజ్జ్వల వీరగాథ

పల్నాటియుద్ధం

స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: రామినీడు సంగీతం: రాజేశ్వరరావు

నిర్మాతలు: టి. హనుమంతరావు, వై. లక్ష్మయ్యచౌదరి,
ఎన్. వెంకయ్య డి. సూర్యనారాయణ

ఎన్. టి. రామారావు, భానుమతి, అంజలీదేవి, జమున,
గుమ్మడి నటించినది.

18 తేదీన 5 ఆటలు
ఉ. 9-30; మ. 2-30; సా. 6-30; రా. 10, 1-30

రోజూ 3 ఆటలు: మ. 2-30; సా. 6-30: రాత్రి 10 గం.

శని-ఆదివారాలలో మాత్రం రోజుకు 4 ఆటలు:
ఉ. 9-30; మ. 2-30; సా. 6-30; రాత్రి 10 గం.

Edited, Printed and Published by N. Sree Ramamurthy at The Zamin Ryot Press, 170, Thipparajuvari Street, Nellore. (A. P.)